సాక్షి అనంతపురం

ఆదివారం । 1 । జనవరి । 2023



వాడీవేడిగా సమావేశాలు

జిల్లాపరిషత్ కార్యాలయంలో శనివారం స్థాయీ సంఘ సమావేశాలు వాడీవేడిగా జరిగాయి. IIలో



టమాట కిలో రూ.8

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8, కనిష్టం రూ.2.50 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
31.9°/15.1°

జిల్లా అంతటా శనివారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి.

న్యూస్‌రీల్

యువతతో ఓటరు నమోదు చేయించాలి



బీఎల్వోలతో మాట్లాడుతున్న ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి

గార్లదిన్నె: జిల్లాలో పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులను గుర్తించి, ఓటరుగా నమోదు చేయాలని ఎన్నికల రోల్ అబ్జర్వర్ మురళీధర్‌రెడ్డి సూచించారు. శనివారం గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి బీఎల్వో వారి పరిధిలో చనిపోయిన, డబుల్ ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలన్నారు. అలాగే యువతీ యువకులకు ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో శింగనమల నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి సుధారాణి, తహసీల్దార్ ఉషారాణి, కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ భాస్కర్, శింగనమల ఎన్నికల డీటీ రామకృష్ణ పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

అనంతపురం శ్రీకంఠం సర్కిల్/ అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2023 సంవత్సరంలో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. కోవిడ్ జాగ్రత్తలు తీసుకుంటూ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అధికారులపై కేసు

పుట్లూరు: భూమి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో నిందితులతో పాటు నలుగురు అధికారులపై పుట్లూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. కడవకల్లు రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 132-ఏ2లోని 1.93 ఎకరాల భూమి విషయంలో తమకు అన్యాయం జరిగిందని చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయించాడు. తన నానమ్మ మునెమ్మ పేరుపై ఉన్న 1.93 ఎకరాల భూమిని సి.కుసుమ అనే మహిళ పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని, ఇందుకోసం పి.కుసుమ అన్న మధుసూదన్‌రెడ్డి నకిలీ దస్తావేజును సృష్టించారని, అప్పటి తహసీల్దార్, వీఆర్వో సహకారంతో ఆర్ఓఆర్‌లో పేరు మార్పు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అప్పట్లో పని చేసిన ఎస్ఐలు తన ఫిర్యాదులు స్వీకరించకపోగా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు మధుసూదన్‌రెడ్డి, సి.కుసుమతో పాటు తహసీల్దార్ విజయకుమారి, వీఆర్వో శివప్రసాద్, ఎస్ఐలు వెంకటప్రసాద్, మోహన్‌కుమార్ గౌడ్‌పై 120బీ, 166, 167, 217, 323, 379, 420, 447, 427, 465, 468, 471, 506, 509 ట/ఠీ 34 ఐపీసీ, 156(3)సీఆర్‌పీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఉచితంగా ఫోర్టిఫైడ్ బియ్యం

- నేటి నుంచి ఎండీయూ ద్వారా పంపిణీ

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని బియ్యం కార్డుదారులకు ఆదివారం నుంచి ఫోర్టిఫైడ్ (బలవర్ధకమైన) బియ్యం ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. కార్డులోని ప్రతి సభ్యునికీ ఐదు కిలోల చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కార్డుదారులకు 35 కేజీలు ఉచితంగా ఇస్తారన్నారు. ఏఏవై కార్డులకు రూ.13.50తో కిలో చక్కెర, ఇతర కార్డుదారులకు అర కిలో రూ.17 ప్రకారం ఇస్తారన్నారు. ఇక కందిపప్పు రూ.67తో ఇస్తారన్నారు. ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాల ద్వారా కార్డుదారుల ఇళ్ల వద్దకే బియ్యం, ఇతర సరుకులు పంపిణీ చేస్తారన్నారు. ప్రతి కార్డుదారుడు బియ్యానికి ఒకసారి, మిగిలిన సరుకులకు ఒకసారి మొత్తం రెండు సార్లు వేలిముద్ర వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సరుకుల పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లు, సీఎస్‌డీటీలను ఆదేశించామన్నారు.

నూతన ఉషస్సు



గడిచినవన్నీ తీపి గుర్తులు.. వచ్చేవన్నీ వసంతాలు..
తీపి, చేదు కలిస్తేనే జీవితం..
కష్టం, సుఖం కలగలిసి
కలల సౌధం నిర్మిద్దాం!
సరికొత్త ఆలోచనలతో,
కొంగొత్త ఆశలతో ముందుకు సాగుదాం..
గతం మిగిల్చిన జ్ఞాపకాలతో..
సంతోషం పంచిన క్షణాలతో..
నవరత్నాలతో.. నవీన ఆశలతో..
నూతన సంవత్సరానికి స్వాగతం!



అనంతపురం క్లాక్‌టవర్ వద్ద యువత 'న్యూ ఇయర్' సంబరాలు



జిల్లాలో నూతన సంవత్సర సంబరాలు అంబరమంటాయి. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు యువతీ యువకులు 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేరింతలు కొట్టారు. కేక్‌లు కట్ చేసి పంచిపెట్టారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతపురం నగరం, పరిసర ప్రాంతాలతో పాటు తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ తదితర పట్టణాల్లో ప్రధాన కూడళ్లన్నీ జనంతో నిండిపోయాయి. కొత్త సంవత్సరం మరింత తేజోమయంగా ఉండాలని చర్చిలు, ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

– అనంతపురం/ అనంతపురం కల్చరల్

జగనన్న లేఅవుట్లకు 126 ఎకరాల సేకరణ

అనంతపురం రూరల్: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా జగనన్న లే అవుట్లకు మరో 126 ఎకరాల భూమి సేకరించినట్లు అనంతపురం ఆర్డీఓ మధుసూదన్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 'పేదలందరికీ ఇళ్లు' పథకం లేఅవుట్ల కోసం మరో మూడు చోట్ల భూమి సేకరించినట్లు తెలిపారు. అనంతపురం మండలంలోని రాచానపల్లి రెవెన్యూ పొలంలో 33 ఎకరాలు, ఉప్పరపల్లిలో 31 ఎకరాలు, బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురం రెవెన్యూ గ్రామ పరిధిలో 62 ఎకరాల భూమిని సేకరించామన్నారు. సేకరించిన భూమి వివరాలను జేసీకి నివేదిక పంపామని, కలెక్టర్ కార్యాలయం నుంచి అనుమతి రాగానే రైతులకు పరిహారం చెల్లించి లేఅవుట్ ఏర్పాటు చేసి అర్బన్, రూరల్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు.

పింఛన్‌దారుల్లో నూతనోత్తేజం

- మాట తప్పని సీఎం వైఎస్ జగన్
- ఈ నెల నుంచే పెరిగిన పింఛన్ పంపిణీ
- తొలగిస్తున్నారనే ప్రతిపక్ష పార్టీ కుట్రలకు చెక్
- రూ.2,500 నుంచి రూ.2,750కు పింఛన్ పెంపు



అనంతపురం సెంట్రల్: ఎన్నికల సమయం నాటికి ఉన్న రూ.2వేల పింఛన్‌ను దశల వారీగా పెంచుకుంటూ పోతామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నెరవేర్చుకున్నారు. రూ.2,500 ఉన్న పింఛన్‌ను ఈ జనవరి నుంచి రూ.2,750కి పెంచి పంపిణీ చేస్తున్నారు. పెరిగిన పింఛన్‌తో వృద్ధులు, వికలాంగులు, వితంతువుల మోములో చిరునవ్వు కనిపించింది. నూతన సంవత్సర కానుకగా ఆదివారం పెరిగిన పింఛన్ పంపిణీకి జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది.

రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారం

పింఛన్లు తొలగిస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై కొద్దిరోజులుగా దుష్ప్రచారం చేస్తూ వస్తోంది. లబ్ధిదారుల్లో ఆందోళన రేపి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న కుట్రలను పటాపంచల్ చేస్తూ ముఖ్యమంత్రి జగన్ స్పష్టత ఇచ్చారు. జనవరి నెల పింఛన్లు యథావిధిగా మంజూరు చేయడంతో ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారం ఉత్తిదేనని తేలిపోయింది. అంతే కాదు ఈ నెలలో పింఛన్ల సంఖ్య కూడా పెరిగింది. గత నవంబర్‌లో 2,69,952 మంది పింఛన్‌దారులకు రూ.69.83 కోట్లు అందజేశారు. జనవరిలో 2,79,309 మందికి రూ.77,97,12,250 పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈ లెక్కన 9,357 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి.


అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

వైఎస్సార్ పింఛన్ కానుక పథకం ద్వారా జనవరి నెలకు సంబంధించి ఒకటో తేదీన పింఛన్ మొత్తం అందించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశాం. 2,79,309 మందికి రూ. 77,97,12,250 విడుదలైంది. నూతన సంవత్సర కానుకగా ఈ నెల మరో రూ. 250 పెంచుతూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నారు. పింఛన్లు తొలగిస్తున్నారన్నది పూర్తిగా అవాస్తవం. గతంలో కన్నా ఈ నెల పింఛన్ల సంఖ్య పెరిగింది.

– నరసింహారెడ్డి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ

విశ్వకవికి విశేష గుర్తింపు

- ఇక.. అధికారికంగా వేమన జయంతి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- తెలుగు కవికి అరుదైన గౌరవం
- సాహితీవేత్తలు, భక్తుల హర్షం



గాండ్లపెంట: పామరులకు సైతం అర్థమయ్యేలా సరళమైన భాషలో కవిత్వం కొనసాగించి వేనోళ్ల కీర్తినందుకున్న తెలుగు కవి వేమనకు మరింత ఖ్యాతి తెచ్చిపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ తెలుగు కవికి అరుదైన గౌరవం కల్పిస్తూ ఆ మహనీయుడి జయంతిని ఏటా జనవరి 19న అధికారికంగా నిర్వహించాలని నిర్ణయిస్తూ జీఓ జారీ చేసింది. శ్రీసత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం కటారుపల్లిలోని వేమన ఆలయాన్ని అభివృద్ధి బాట పట్టించి అప్పట్లో వైఎస్సార్ వేమన భక్తులకు సంతోషం పంచగా.. తండ్రి బాటలోనే సీఎం వైఎస్ జగన్ ఆయనకు మించి చర్యలు తీసుకుంటుండడంపై భక్తులే కాకుండా సాహితీవేత్తలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మరింత గుర్తింపు

విశ్వకవి యోగి వేమన జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం జీఓ జారీ చేయడం హర్షణీయం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. దీంతో కటారుపల్లి వేమన సమాధికి మరింత గుర్తింపు రానుంది.

– డాక్టర్. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వేమన అధ్యయన కేంద్ర కార్యదర్శి

పోరాటాలు ఫలించాయి

వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని చాలా సంవత్సరాలుగా పోరాటం చేశాం. ఎట్టకేలకు అవి ఫలించాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రోజాకు మన స్ఫూర్తిగా కృతజ్ఞతలు.

– గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర రెడ్డి సంఘం అధ్యక్షుడు

బాలికల ఫుట్‌బాల్ లీగ్ విజేత 'లేపాక్షి'

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంత క్రీడాగ్రామం వేదికగా ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-18 బాలికల ఫుట్‌బాల్ లీగ్ విజేతగా లేపాక్షి జట్టు నిలిచింది. ఫైనల్స్‌కు చేరుకున్న లేపాక్షి, హిందూపురం టౌన్, గుత్తి టౌన్ జట్ల మధ్య శనివారం రౌండ్ రాబిన్ విధానంలో పోటీలు నిర్వహించారు. ఆరు పాయింట్లతో లేపాక్షి జట్టు, మూడు పాయింట్లతో హిందూపురం టౌన్, ఒక్క పాయింట్‌తో గుత్తి టౌన్ జట్లు వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను ఆర్డీటీ ఏఎస్ఏ రెసిడెన్షియల్ ప్రోగ్రాం మేనేజర్ వంశీ, ఫుట్‌బాల్ ప్రోగ్రాం మేనేజర్ దాదాఖలందర్ అందజేశారు.

వాడీవేడిగా స్థాయీ సంఘ సమావేశాలు

అనంతపురం సిటీ: కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది మధ్య తలెత్తిన మనస్పర్థలకు పిల్లలను బలి చేయడం దుర్మార్గమైన చర్య అని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ స్థాయీ సంఘం సమావేశాలు శనివారం వాడీవేడిగా సాగాయి. జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో జరిగిన స్థాయీ సంఘం-2, 4,(గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం) సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి, మాట్లాడారు. కేజీబీవీల్లో చోటు చేసుకున్న వరుస ఘటనలపై ఇన్‌చార్జ్ డీఈఓ వెంకటకృష్ణారెడ్డిని నిలదీశారు. దీనిపై ఆయన స్పందిస్తూ.. తొలిసారి చోటు చేసుకున్న ఘటనలో బాధ్యులైన ఇద్దరిని విధుల నుంచి తప్పించినట్లు వివరించారు. రెండోసారి ఘటనకు సంబంధించి ఐదుగురిని సస్పెండ్ చేయడంతో పాటు మరో ఇద్దరిని బదిలీ చేసినట్లు తెలిపారు. నాడు-నేడు కింద చేపట్టిన పనులకు సిమెంట్ సరఫరా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు గొల్ల అనూష కోరారు. మళ్లీ కరోనా ప్రబలుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సభ్యులందరూ ముక్తకంఠంతో కోరారు. జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

• అదనపు సమావేశ భవన్‌లో స్థాయీ సంఘం -5 సమావేశం జరిగింది. డి.హీరేహాల్ జెడ్పీటీసీ సభ్యురాలు హసీనాబాను అధ్యక్షత వహించారు. డిప్యూటీ సీఈఓ శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా ఐసీడీఎస్ పీడీలు డా.బీఎన్ శ్రీదేవి, లక్ష్మీకుమారి, సీడీపీఓ చల్లా లలిత హాజరయ్యారు. గత నాలుగు సమావేశాల్లో లేవనెత్తిన సమస్యపై ఐసీడీఎస్ అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టలేదని, ఈ నెల 7వ తేదీలోపు సమస్యకు పరిష్కారం చూపకపోతే పుట్టపర్తిలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతానని అమడగూరు జెడ్పీటీసీ సభ్యురాలు కవిత స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్, రూరల్, నార్పల మండలంలోనూ చాలా కేంద్రాలకు సొంత భవనాలు లేవని, సొంత భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే తమ వంతు సహకారం అందిస్తామని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, అనంతపురం జెడ్పీటీసీ చంద్రకుమార్ సూచించారు. అంగన్‌వాడీ మినీ కేంద్రాలన్నింటినీ మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లేని గ్రామాలకు కొత్త కేంద్రాలు మంజూరు చేయాలని ఉరవకొండ జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ, కదిరి జెడ్పీటీసీ సభ్యురాలు రాధ కోరారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా సామాజిక వర్గానికి చెందిన వారినే ఆయాలుగా నియమించాలని జెడ్పీటీసీ చంద్ర కోరారు.



సమస్య వివరిస్తున్న చిలమత్తూరు జెడ్పీటీసీ సభ్యురాలు అనూష (చిత్రంలో) జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

వ్యక్తి అనుమానాస్పద మృతి



మృతుడు చిదానందప్ప

రాయదుర్గం రూరల్: రైలు పట్టాల పక్కన వ్యక్తి మృతి చెందడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాలు.. రాయదుర్గం మండలం పల్లేపల్లి సమీపంలో రైలు పట్టాల పక్కన శనివారం అదే గ్రామానికి చెందిన గొల్ల చిదానందప్ప (45) మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నాడు. ఎవరైనా హతమార్చి రైలు పట్టాల పక్కన పడుకోబెట్టారా? లేక సహజ మరణమా? అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు గుంతకల్లు రైల్వే పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

అనంతపురం కల్చరల్: ప్రజాకవి యోగి వేమన జయంతిని ఈనెల 19న అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వమే ముందుకు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం వేర్వేరు ప్రకటనల్లో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ సాహితీరంగంలో వేమన జీవితం చెరిగిపోలేని అధ్యాయమని ఆయన్ను గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి, ఏపీ రెడ్డి జనసంఘ నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు ప్రభుత్వాన్ని అభినందించారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం

అనంతపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద విద్యార్థులకు అండగా నిలిచారని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత అనంత చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏ నారాయణపురం పంచాయతీ తపోవనం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కోగటం మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో నాడు- నేడు పనులు చేపట్టి, పాఠశాలల రూపురేఖలే మర్చారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి, మల్లెల వేణుగోపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



మరూరులో పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీబీఆర్ శర్మ పేర్కొన్నారు. శనివారం మరూరులో ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో భాగంగా పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, సర్పంచు ప్రభావతి వీధుల్లో శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపాల్ టి.సూర్యశేఖర్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు నాయక్, పీడీ రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సంతోషంగా ఉండాలి



ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ హేమలత

ఆత్మకూరు: మండల ప్రజలు ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉండాలని ఎంపీపీ సుబ్బార హేమలత తెలిపారు. శనివారం ఎంపీడీఓ కొండన్న, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందితో కలిసి నూతన సంవత్సరం సందర్భంగా ముందస్తుగా కేక్ కట్ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధిచేకూర్చిందన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



ఆర్‌కే నగర్‌లో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: అమ్మఒడి, విద్యా, వసతి దీవెన, ఈబీసీ నేస్తం, రైతు భరోసా, తదితర పథకాలతో ఆర్థిక భరోసా లభిస్తోందని ధనలక్ష్మి, శంకరమ్మ, మహబూబ్ బీ, తదితరులు ఎమ్మెల్యేతో ఆనందాన్ని పంచుకున్నారు. ఏటా రూ.లక్షల్లో తమ ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు వర్తించకపోయింటే ఆర్థికంగా ఇబ్బంది పడేవాళ్లమని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే సేవలందుతున్నాయని విశ్రాంత ఉద్యోగి బాబయ్య ఎమ్మెల్యేతో అన్నారు. ఆర్‌కే నగర్‌లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని 48వ డివిజన్‌లోని ఇందిరాగాంధీనగర్, ఆర్‌కే నగర్‌లలో స్థానిక కార్పొరేటర్ శ్రీనివాసులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంనిర్వహించారు. ఆర్‌కేనగర్‌కు చెందిన డాక్టర్ సునీల్ కుమార్, విశ్రాంత ఉద్యోగి నారాయణస్వామి, తదితరులు డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీధి లైటు ఏర్పాటు చేయాలని రత్నమ్మ అనే మహిళ కోరింది. మూడు నెలల క్రితమే సమస్యను ఏఈ సాయి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని కార్పొరేటర్ శ్రీనివాసులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి: ఇందిరాగాంధీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎం శేషమ్మను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆర్‌కేనగర్‌లోని పాఠశాలను ఎమ్మెల్యే పరిశీలించి, హెచ్‌ఎం, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు త్వరలో ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలువలను సరిగా శుభ్రం చేయడం లేదని వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేయగా, పారిశుధ్య కార్యదర్శి ఉషారాణిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.

910 పింఛన్లు మంజూరు:
అర్హుల పింఛన్లు తొలగించలేదని, కొత్తగా మరో 910 పింఛన్లను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో స్వార్థ రాజకీయాలతో, నగరాన్ని భయభ్రాంతులకు గురి చేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తాము ఐకమత్యంతో నగరంలో రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే 65 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, త్వరలో మిగితా పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, కార్పొరేటర్లు చంద్రమోహన్ రెడ్డి, సైఫుల్లాబేగ్, అనిల్, కమల్, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నిమ్మల నాగరాజు, అనిల్‌కుమార్ గౌడ్, శ్రీనివాసుల రెడ్డి, గోయిందు, సుజాత రెడ్డి, శ్రీదేవి, భారతి, పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యానికి ప్రత్యేక గుర్తింపు

- విశ్రాంత వైస్ చాన్సలర్ కాడా రామకృష్ణారెడ్డి



వేమన చిత్రపటానికి నీరాజనాలర్పిస్తున్న వేమన ఫౌండేషన్ సభ్యులు

అనంతపురం కల్చరల్: యోగి వేమన సాహిత్యానికి, కటారుపల్లెలోని ఆయన సమాధికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డికి విశ్రాంత వీసీ కాడా రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. వేమన ఫౌండేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వేమన జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు జీవో విడుదల చేసిన ప్రభుత్వాన్ని అభినందిస్తూ పలువురు రచయితలు, పరిశోధకులతో సమావేశం జరిగింది. డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో రామకృష్ణారెడ్డితో పాటు విశ్రాంత రిజిస్ట్రార్ రవీంద్రరాజు, మానవత సంస్థ తరిమెల అమరనాథరెడ్డి, రచయితలు రియాజుద్దీన్, మధురశ్రీ, రామలింగారెడ్డి, ఎల్కేపీ అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నీరాజనాలర్పించారు.

మూడు దశాబ్దాలు అంతులేని అరాచకం

- 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్
- డిప్యూటీ మాజీ మేయర్ గంపన్న, అనుచరగణంపై ఆగ్రహం



మాట్లాడుతున్న 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్

అనంతపురం క్రైం: నాయక్‌నగర్‌లో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, అనుచరగణం మూడు దశాబ్దాల పాటు అరాచకం సాగించారని 33వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్ ఆరోపించారు. భూకబ్జాలు, దౌర్జన్యాలకు పాల్పడి, అరాచక పాలన సాగించారన్నారు. ఇటీవల పింఛన్ల తొలగింపు పేరిట మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న చేసిన ఆరోపణలను సాకే చంద్రశేఖర్ తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. 33వ డివిజన్‌లో చంద్రకళ అనే వితంతువుకు పింఛన్ తొలగించారని వారు విమర్శలు చేయడం సరికాదన్నారు. వాస్తవంగా చంద్రకళ అర్హురాలు కాదని, ఆమె పేరిట రూ.కోట్లు విలువ చేసే స్థలం ఉందన్నారు. ఆడిట్‌లో భాగంగా 36 మంది అనర్హులకు నోటీసులు వచ్చాయన్నారు. మొత్తం 442 పింఛన్లు ఇస్తున్నామని, కొత్తగా మరో 15 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. దీనిపై వారు తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం
వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాతనే నగరం అభివృద్ధి చెందుతోందని సాకే చంద్రశేఖర్ అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ నాయకులు తన డివిజన్‌లో పర్యటించినా, ఇక్కడి ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలు చూసి వెనుదిరగక తప్పదన్నారు. డిప్యూటీ మేయర్ గంపన్న, ఆయన బావమరది పరంధామ, అనుచరగణం గంగన్న, చంద్రమోహన్, రవి, అమర్నాథ్ చౌదరి, మాధవయ్య, చిట్టిబాబు బృందంగా ఏర్పడి చేసిన దౌర్జన్యాలను ఆయన మీడియాకు తెలియజేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో మాజీ ఎమ్మెల్యే అక్రమాలకు వత్తాసు పలికి గిరిజనులను ముందుంచి అగ్రవర్ణాల వారిపై తప్పుడు అట్రాసిటీ కేసులు పెట్టించారన్నారు. వీరి అరాచక పాలనతోనే గత ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కలేదన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే విజయం సాధిస్తుందన్నారు.

నగరానికి దీటుగా రాజీవ్‌కాలనీ అభివృద్ధి



హైమాస్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం రూరల్: నగరానికి దీటుగా రాజీవ్‌కాలనీ పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం రాజీవ్‌కాలనీలో హైమాస్ లైట్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజీవ్‌కాలనీ పంచాయతీని దత్తకు తీసుకున్న ప్రజాప్రనిధులు.. అభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత పంచాయతీలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. నియోజకవర్గ పరిధిలోని పంచాయతీలను నగరానికి ధీటుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలుపుతామన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి, నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాబీ, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్య, వైఎస్సార్ సీపీ నాయకులు హుస్సేన్, రహీమ్, కరీమ్, దౌలా, అంజి, మల్లెల వేణు తదితరులు పాల్గొన్నారు.

అనంత ప్రజలందరికీ మంచి జరగాలి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం క్రైం: నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరిగి, సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. శనివారం ఆర్‌కే నగర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజలందరికీ ఆయన నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాదిలో (2023)లో వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండి, రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు యధావిధిగా అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

నేడు పింఛన్ కానుక పంపిణీ

అనంతపురం క్రైం: నగర శివారులోని గుత్తి రోడ్డు విద్యుత్ కళాభారతిలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ కే భాగ్యలక్ష్మి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ ఓ ప్రకటన విడుదల చేసింది. కొత్తగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి పింఛన్ రూ.2,750 వస్తుందన్నారు. ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య హాజరవుతున్నారని తెలిపారు.

సంత ద్వారా రూ.1.81 లక్షల ఆదాయం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాల సంత ద్వారా రూ.1,81,280 ఆదాయం సమకూరినట్లు యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ వై.రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పశువులకు వ్యాపిస్తున్న ముద్దచర్మవ్యాధి (లంపీస్కిన్ డీసీసెస్) కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ మూడో వారం నుంచి మార్కెట్ యార్డులో పశువుల సంత బంద్ చేశామన్నారు. కేవలం శనివారం మాత్రమే గొర్రెలు, మేకల క్రయ,విక్రయాలు జరుగుతున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: అనంతపురం ఆర్డీటీ, పీటీసీ క్రీడా మైదానాల్లో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి అంధుల క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు అంధ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జలంధర్‌రెడ్డి తెలిపారు. అన్ని జిల్లాలకు చెందిన అంధుల క్రికెట్ జట్లు పాల్గొంటాయన్నారు.

నేడు రాప్తాడులో ఎమ్మెల్యే పర్యటన

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పర్యటన ఉంటుందని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం పింఛన్ల పంపిణీకి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ వలంటీర్లు, పార్టీ సచివాలయాల కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



రాప్తాడులో జగనన్న కాలనీలో తలుపులకు అమర్చే నిలువులను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న అధికారులు

రాప్తాడు: లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగతిన పూర్తి చేయాలని హౌసింగ్ డీఈ కృష్ణా రావు పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వైఎస్సార్ జగనన్న ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులకు తలుపుల నిలువులు పంపిణీ చేశారు. రాప్తాడు జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకునే వారందరికి నిలువులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, హౌసింగ్ ఏఈ దేవరకొండ రామ్మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దాసరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శాప్ లీగ్ క్రీడా పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండో ఫేజ్ శాప్ లీగ్ క్రీడా పోటీల్లో భాగంగా క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు అన్‌సెట్ సీఈఓ కేశవనాయుడు తెలిపారు. 2న స్థానిక పీటీసీ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ పోటీలు, 3న ఇం డోర్ స్టేడియంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఎంట్రీ ఫీజు చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 08554-353223లో సంప్రదించాలన్నారు.

యోగి వేమన జయంత్యుత్సవాల ప్రకటనపై హర్షం



బుడ్డా వెంగల్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న ఏపీ రెడ్డి జన సంఘ నాయకులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: ప్రభుత్వం యోగి వేమన జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించడంపై ఏపీ రెడ్డి జన సంఘ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. జనవరి 19న అధికారికంగా నిర్వహించనుండడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా రెడ్డి జన సంఘ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దానకర్ణుడు బుడ్డా వెంగల్‌రెడ్డి 122వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి జన సంఘ జిల్లా అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్‌రెడ్డి, సభ్యులు సత్యనారాయణరెడ్డి, శివారెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, సూర్యచంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ 5 నో ఎగ్జిట్ చిత్రాన్ని ఆదరించండి



చిత్రయూనిట్‌తో డిప్యూటీ మేయర్లు

అనంతపురం కల్చరల్: 'ఎస్ 5 నో ఎగ్జిట్' చిత్రాన్ని ఆదరించాలని దర్శకుడు భరత్ కోమలపాటి అన్నారు. శనివారం స్థానిక గౌరీ థియేటర్‌లో చిత్రయూనిట్ సభ్యులతో పాటు డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర రెడ్డి, వాసంతి సాహిత్య ,సుధాకరబాబు మాట్లాడారు. అందరూ థియేటర్లకు వచ్చి సినిమాలను ఆదరించాలని చిత్ర యూనిట్ సభ్యులు కోరారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ భరత్ కోమలపాటి చిన్ననాటి నుంచే మంచి సృజన కలిగిన యువకుడని, ఆయన తీసిన చిత్రం వందల థియేటర్లలో విడుదలైందన్నారు. అనంతలో తమ చిత్రాన్ని ప్రోత్సహించాలని కోరారు. హార్రర్ కామెడీతో చిత్రం అందరినీ ఆకట్టుకుంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు దర్శకుడు భరత్‌ను పలువురు పూలమాలలు వేసి అభినందించారు. సోమశేఖరనాయుడు, మురళీ, అసిస్టెంట్ డైరెక్టర్ సంతోష్ మాట్లాడారు.

దానిమ్మ ధర అదుర్స్

- రైతన్న దిగుబడి దిగులు తీర్చిన బగువ
- సిరులు కురిపిస్తున్న పంట
- 5.60 ఎకరాల్లో 60 టన్నుల దిగుబడి
- దానిమ్మ సాగులో రామినేపల్లి రైతు పలువురికి ఆదర్శం



విరగ్గాసిన దానిమ్మ కాయలు



దానిమ్మ కాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

రాప్తాడు: ఏటేటా వేరుశనగ, ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతన్నకు దానిమ్మ పంట ధీమానిస్తోంది. వర్షాభావ పరిస్థితులకు తట్టుకొని ఆశాజనక దిగుబడినిస్తోంది. అప్పుల ఊబిలో కూరుకుపోయి, ఆర్థికంగా చితికిపోయిన రామినేపల్లికి చెందిన ఆదర్శ రైతు పుల్లలరేవు చెన్నారెడ్డి.. వ్యవసాయానికి స్వస్తి పలికాడు. ఉద్యాన అధికారి రత్నకుమార్ సూచనలతో దానిమ్మ పంట సాగు చేసి, లాభాలు ఆర్జిస్తూ రైతులకు ఆదర్శంగా నిలిచాడు. మండలంలోని రామినేపల్లికి చెందిన ఆదర్శ రైతు పుల్లలరేవు చెన్నారెడ్డి తన కుమారుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ విశ్వేశ్వరరెడ్డి సహకారంతో మొత్తం 5.60 ఎకరాల్లో బగువ రకం దానిమ్మ పంట సాగు చేశాడు. దానిమ్మ పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నాడు. తక్కువ నీటితోనే అధిక దిగుబడి సాధించి లాభాలు గడిస్తున్నాడు. రెండేళ్ల తర్వాత 2020లో పంట కాపు ప్రారంభమైంది. ఆ తర్వాత ఏడాదికోసారి పంట చేతికి వచ్చింది. మొదటి పంట 2020లో 10 టన్నులు దిగుబడి వచ్చింది. ధర ఆశాజనకంగా ఉండడంతో పెట్టుబడి పోనూ దాదాపు రూ.10 లక్షలు ఆదాయం వచ్చింది. 2021లో నాలుగు ఎకరాల్లో 40 టన్నుల దిగుబడి రాగా, టన్ను రూ.లక్ష చొప్పున రూ.40 లక్షల వచ్చింది. ఆతర్వాత పొలం పక్కనే ఉన్న బీడు భూమి 1.60 ఎకరంలోనూ పంట సాగు చేశాడు. మొత్తం 5.60 ఎకరాల్లో దానిమ్మ పంటకు 60 టన్నుల దిగుబడి వచ్చింది.

తెగుళ్ల నివారించుకోవాలి :

ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి భారీ వర్షాలు కురవడంతో పంటకు తెగుళ్లు అధికంగా సోకాయి. తెగుళ్ల నివారణకు దాదాపుగా 30 నుంచి 40 సార్లు మందులు పిచికారీ చేశాడు. పంట దిగుబడికి ఎరువులు, తెగుళ్ల నివారణకు మందుల కోసం దాదాపుగా రూ.14 లక్షలు ఖర్చు చేసినట్లు రైతు తెలిపాడు. కాయ దశలో దానిమ్మ పంటకు వివిధ రకాల తెగుళ్లు ఆశించాయి. వాటి నివారణకు రైతు చెన్నారెడ్డి సకాలంలో మందులు పిచికారీ చేసి,పంటను జాగ్రత్తగా కాపాడుకోవడంతో అధిక దిగుబడి వచ్చింది. దానిమ్మకు ప్రస్తుతం మార్కెట్లో మంచి ధర ఉండడంతో బెంగళూరుకు చెందిన వ్యాపారులు పొలం వద్దకే వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. 10 రోజుల క్రితం 25 టన్నులు కోయగా ఒక్కో టన్ను రూ.1.15 లక్షతో రూ.28,75000 ఆదాయం వచ్చింది. రెండు రోజుల క్రితం 35 టన్నులు కోయగా రూ. టన్ను రూ.లక్ష ప్రకారం 34 టన్నులకు రూ.35 లక్షలు ఆదాయం వచ్చింది.

కన్న బిడ్డల్లా చూసుకోవాలి



వేరుశనగ, బెండ, అనప, టమాట, మెరప తదితర పంటలను సాగు చేసి తీవ్రంగా నష్టపోయా. ఉద్యాన అధికారి రత్నకుమార్ సూచనల మేరకు 2018లో దానిమ్మ పంటను సాగు చేశా. ఈ ఏడాది ఖరీఫ్‌లో భారీ వర్షాలు కురవడంతో దానిమ్మకు తెగుళ్లు అధికంగా వ్యాపించాయి. దానిమ్మ పంటను కన్న బిడ్డల్లా చూసుకోవాలి. ఉద్యాన అధికారి రత్నకుమారు తోట దగ్గరకు వచ్చి పంటకు ఏ తెగులు సోకిందో సలహాలు ఇచ్చేవారు. ఆయన సలహాల మేరకు మందులు పిచికారీ చేసి పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాం. ఈ ఏడాది 5.60 ఎకరాల్లో 60 టన్నుల దిగుబడి వచ్చింది. పెట్టుబడి పోయి రూ.50 లక్షలు ఆదాయం వచ్చింది.

– చెన్నారెడ్డి, రైతు, రామినేపల్లి

యాజమాన్య పద్ధతులు పాటించాలి



దానిమ్మ పంటను చాలా మంది రైతులు సాగు చేసి నష్టపోయారు. దానిమ్మ పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడితోపాటు అధిక లాభాలు పొందొచ్చు. ఈ ఏడాది భారీ వర్షాలకు తెగుళ్లు అధికంగా వ్యాపించాయి. దీంతో ఎక్కువ మంది రైతులకు దిగుబడులు రాక పంటను అలాగే తోటలోనే వదిలివేశారు. అధికారుల సలహాల మేరకు మందులు పిచికారీ చేసిన కొంత మంది రైతులకు మాత్రమే నాణ్యమైన కాయలు దిగుబడులు వచ్చాయి.

– రత్నకుమార్, ఉద్యానశాఖ అధికారి, రాప్తాడు

అభివృద్ధి ఏమి చేశారు ప్రభాకరా?



24వ డివిజన్‌లో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన మేయర్ వసీం

అనంతపురం క్రైం: గత టీడీపీ పాలనలో గ్రూపు రాజకీయాలతో అభివృద్ధిని విస్మరించారు..తమ ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత మూడేళ్లలోనే రూ.వందల కోట్ల అభివృద్ధి జరిగింది.. మీ పాలనలో ఏం ఒరగబెట్టారని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని మేయర్ వసీం ప్రశ్నించారు. శనివారం నగరంలోని 24వ డివిజన్‌లో రూ.30 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మేయర్ ప్రారంభించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని టీడీపీ చేస్తున్న బూటకపు కార్యక్రమానికి ప్రజాదరణ లేదన్న అక్కసుతో వలంటీర్లను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి బెదిరిస్తున్నారంటూ తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదన్నారు. గత ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని పట్టించుకోని మీకు ప్రజలు సమస్యలు విన్నవించుకునే పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యే 'అనంత' ప్రత్యేక చొరవతో నగరపాలక సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.800 కోట్లతో ప్రధాన రహదారుల్లో రోడ్లు, వివిధ డివిజన్లలో అంతర్గత రోడ్లు, కాలువలు, తదితర వాటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలే ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తు చేస్తున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరైందన్నారు. టీడీపీ నాయకుల దుష్ప్రచారాలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సంపంగి శ్రీనివాసులు, సైపుల్లాబేగ్, కమల్‌భూషణ్, ఎస్ఈ నాగమోహన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బేకరీలపై తూ.కొ. అధికారుల తనిఖీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో బేకరీల నిర్వాహకులు నగర వాసులను నిలువునా మోసం చేస్తున్నారు. కిలో కేక్ తూకం వేస్తే 750 గ్రాములు తూకం చూపుతోంది. తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం రాత్రి నిర్వహించిన తనిఖీల్లో ఈ మోసం బయట పడింది. కాగా ఏడు బేకరీలపై తూనికలు, కొలతల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ మేరకు ఆ శాఖ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ గౌస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...బేకరీల్లో నూతన సంవత్సర వేడుకలకు భారీగా కేక్‌లు తయారు చేసి, ప్రత్యేక మాల్స్ ఏర్పాటు చేశారు. చాలా బేకరీల నిర్వాహకులు తూకాల్లో మోసంతో పాటు ఎంఆర్‌పీ, మ్యాన్‌ఫ్యాక్చరింగ్ తేదీ, కస్టమర్ కేర్ నంబర్లు లేకుండా కేక్‌లు తయారు చేసి, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నగరవాసుల ఫిర్యాదు మేరకు ఏడు బేకరీలపై కేసులు నమోదు చేశామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ గౌస్ తెలిపారు. బెంగళూరు బేకరీ, బుచ్చయ్య స్వీట్స్, స్వగృహ ఫుడ్స్, పార్క్‌లైన్ బేకరీతో పాటు పలు షాపులకు జరిమానాలు విధించినట్లు ఆయన తెలిపారు.

అండర్ -19 హ్యాండ్‌బాల్ టోర్నీ విజేత అనంతపురం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంవీఐ వరప్రసాద్

కదిరి అర్బన్: కదిరి మండలం ఎరుకులవాండ్లపల్లిలోని హరీష్ పాఠశాలలో జరుగుతున్న అండర్–19 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ (బాలికల) టోర్నీ విజేతగా అనంతపురం జట్టు నిలిచింది. శనివారం ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడ్డాయి. అనంత క్రీడాకారులు ఆది నుంచి దూకుడుగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చారు. కదిరి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీ అందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి ముస్తఫా కమాల్‌బాషా, హరీష్ పాఠశాల ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్‌తో పాటు 13 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

రేపు ఆఖండ విష్ణు సహస్రనామ పారాయణం

తాడిపత్రి టౌన్ : స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆఖండ విష్ణు సహస్రనామ పారాయణం జరగనున్నట్లు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు సురేంద్రనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

తైక్వాండోలో చిన్నారుల ప్రతిభ

పామిడి: బెంగళూరులోని రియాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో అండర్–18 కేజీల సబ్ జూనియర్ విభాగంలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థిని సుహాన దిలీషా బంగారు, క్యాడేట్ అండర్ –33 కేజీ విభాగంలో అబ్దుల్ రెహమాన్ సిల్వర్ పతకాన్ని సాధించారు. ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ సతీష్‌కుమార్ శనివారం విద్యార్థులను అభినందించారు. ఇదే పోటీల్లో ప్రతిభ చాటిన చైతన్య స్కూల్‌కు చెందిన విద్యార్థి కేదార్ సింహను స్కూల్ సీఈఓ సంతోష్‌రెడ్డి, డైరెక్టర్ రమణారెడ్డి అభినందనలు తెలియజేశారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

తాడిపత్రి టౌన్ : 2023కు సంబంధించి సర్వీసు, ఫ్యామిలీ పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్ల (జీవన ప్రమాణ్ పత్రాలు)ను జనవరి 31వ తేదీలోపు ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయాలని తాడిపత్రి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్జీవో హోంలో జనవరి నుంచి అసోసియేషన్ ఆధ్వర్యంలో దరఖాస్తులు పూర్తి చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మొబైల్ ఫోన్, పాస్‌పోర్టు సైజు ఫొటో, ఐడీ నంబర్, బ్యాంకు పాసు పుస్తకం, సాంవత్సరిక సభ్యత్వ పత్రాలతో వస్తే పూర్తి చేసిన దరఖాస్తును ఎస్‌టీఓ కార్యాలయంలో అందజేయనున్నట్లు తెలియజేశారు. పెన్షనర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బుక్కరాయసముద్రం: రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంటలో ఉన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సహదేవరెడ్డి పేర్కొన్నారు. శనివారం రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో శాస్త్రవేత్తల, వ్యవసాయ శాఖ అధికారుల రైతుల సాగు చేసే పంటల సాగుపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సహదేవరెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడి తప్పకుండా చేసుకోవాలన్నారు. పంటల సాగులో వ్యవసాయ శాఖ అధికారులు వివిధ అంశాలపై శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చారు.

హ్యాపీ న్యూ ఇయర్

అనంతపురంలో నూతన సంవత్సర శోభ సంతరించుకుంది. క్లాక్‌టవర్, నగర పాలక సంస్థ కార్యాలయంతో పాటు పలు చర్చీలు, పలు సర్కిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వీట్లు, చాక్లెట్లు, బొకేల దుకాణాలు కిటకిటలాడాయి. శనివారం అర్ధరాత్రి తర్వాత న్యూ ఇయర్ సంబరాలు ఘనంగా జరిగాయి. యువతీ యువకులు.. చిన్నారులు.. పెద్దలు అన్ని వర్గాల వారూ రోడ్లపైన, ఇళ్లలోన న్యూ ఇయర్ వేడుకలు జరుపుకొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



క్లాక్ టవర్ వద్ద 2023 సంవత్సరానికి స్వాగతం



విద్యుత్ వెలుగుల్లో నగరపాలక సంస్థ కార్యాలయం



కేక్‌లు కొనుగోలు చేస్తున్న దృశ్యం



నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం





అర్ధరాత్రి12 గంటలకు హ్యాపీ న్యూ ఇయర్ వేడుకలు జరుపుకుంటున్న నగర ప్రజలు, యువత

నిండుకుండలా పేరూరుడ్యాం



డ్యాంగేట్లను ఎత్తడంతో దిగువకు వెళ్తోన్న నీరు (ఫైల్)

- రెండేళ్లుగా హంద్రీనీవా నీటితో కళకళ
- డ్యాం సామర్థ్యం 1.81 టీఎంసీలు
- 28 టీఎంసీల నీటిని దిగువకు వదిలిన అధికారులు

రామగిరి: అప్పర్ పెన్నార్ ప్రాజెక్ట్ (పేరూరు డ్యాం) రెండేళ్లుగా నిండుకుండను తలపిస్తోంది. దీంతో మూడుదశాబ్దాలుగా మూగబోయిన పెన్నానది కళకళలాడుతోంది. డ్యాం సామర్థ్యం 1.81 టీఎంసీ కాగా, మొత్తం నీటి మట్టం 1,763 అడుగులు ఉంది. ప్రస్తుతం 1,762 అడుగుల నీరు నిల్వ ఉంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో రెండేళ్లుగా పేరూరుడ్యాం హంద్రీనీవా నీటితో తొణికిసలాడుతోంది. దీనికితోడు ఈఏడాది రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. కర్ణాటకలో పుట్టిన పెన్నానది చెరువులు, డ్యాంలను నింపింది. ఇంతేకాక డ్యాం నీటిమట్టం 1.81 టీఎంసీ కాగా, అక్టోబర్, నవంబర్ నెలలతోపాటు డిసెంబర్ మొదటి వారం వరకు ఏకంగా 70 రోజులు డ్యాంలోని నీటిని ఇప్పటికే 28 టీఎంసీల నీటిని దిగువ ప్రాంతాలకు వదిలినట్లు ఇరిగేషన్ డీఈ వెంకటరమణ తెలిపారు. అంతేకాక ప్రస్తుతం నిల్వ ఉన్న నీటిని కుడి, ఎడమల కాలువల ద్వారా రైతుల పంటల సాగుకు వదులుతున్నట్లు తెలిపారు.

పరిటాల హయాంలో ఓటిపోయిన డ్యాం :

పరిటాల కుటుంబ సభ్యులు మూడు దశాబ్దాలుగా అధికారంలో ఉన్నా .. ఏనాడూ పేరూరు డ్యాం గురించి ఆలోచించిన పాపాన పోలేదు. ఎన్నికల సమయంలో పేరూరు డ్యాంకు నీరిస్తామని హామీలు ఇచ్చి పబ్బంగడుపుకునేవారని ప్రజలు అంటున్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల 30 ఏళ్లగా డ్యాంలోకి నీరువచ్చే మార్గాలు లేకపోవడంతో అప్పట్లో చాలామంది రైతులు తమ కుటుంబాలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. దీంతో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడంతో డ్యాంకు నీరొచ్చిందని ప్రజలు అంటున్నారు. మూడు దశాబ్దాల కాలం ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగితే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



పేరూరు డ్యాం

సకల పాప హరణం.. వైకుంఠ ద్వార దర్శనం

- నేటి అర్ధరాత్రి నుంచే ముక్కోటి ఏకాదశి వేడుకలు
- కోవిడ్ నిబంధనల తప్పనిసరి అంటున్న అధికారులు





వైకుంఠ ఏకాదశికి సిద్ధమైన పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయం

అనంతపురం కల్చరల్: ధనుర్మాసంలో వచ్చే పవిత్ర ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. చీకటికి ప్రతిరూపమైన దక్షిణాయనం నుంచి వెలుగు రేఖలు ప్రసరించే ఉత్తరాయనంలోనికి దేవతలు ప్రవేశించే తొలితిథిని వైకుంఠ ఏకాదశి అని, ముక్కోటి ఏకాదశి అని పిలుస్తారు.వైకుంఠ ద్వార ప్రవేశం సకల పాప హరమని, ముక్తికి సులభ మార్గమన్నది అందరి విశ్వాసం. 'వైకుంఠ ద్వార దర్శనం ' అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కాబట్టే అన్ని వైష్ణవాలయాల్లో ఏకాదశి రోజున ఉత్తరం వైపున ద్వారా తెరుస్తారు.

ప్రముఖ ఆలయాల్లో దర్శన భాగ్యం:

జిల్లాలోని ప్రధాన వైష్ణవ క్షేత్రాలైన కదిరి, కసాపురం ఆలయాల్లో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచే వైభవంగా జరిగే ముక్కోటి ఏకాదశి వేడుకలకు ప్రభుత్వం నిబంధనలు విధించింది. జాగ్రత్తలు పాటిస్తూ వేడుకలు చేసుకోవాలని సూచించింది. సాధారణంగా కలియుగ వైకుంఠాన్ని తలపించే శ్రీవేంకటేశ్వర స్వామి, పాతూరు చెన్నకేశవ స్వామి ఆలయాల్లో అర్ధరాత్రి నుంచే భక్తులు పోటెత్తుతారు. ఈసారి నూతన సంవత్సరాది రోజునే రానుండడంతో భక్తులరద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

ముస్తాబైన ఆలయాలు:

సోమవారం రానున్న ముక్కోటి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రధాన ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ప్రధానంగా పాతూరులోని ప్రాచీన చెన్నకేశవాలయం, రామనగర్, హౌసింగ్‌బోర్డు, ఆర్ఎఫ్ రోడ్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాలు, శ్రీనివాస నగర్‌లోని బాలాజీ మందిరం, రెవెన్యూ కాలనీలోని రామాలయం, మొదటి రోడ్డు శివాలయం తదితర ఆలయాలను విద్యుత్ దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. స్థానిక రెవెన్యూ కాలనీలోని శ్రీ కోదండరామ ఆలయంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం సాగుతుందని తెలిపారు.



ఆలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీఓ మధుసూదన్

నిబంధనలు పాటించాలి :

కోవిడ్ మరో రూపంలో తలెత్తే అవకాశముందని అందరూ భావిస్తున్న నేపథ్యంలో అప్రమత్తతతో దైవ దర్శనాలుండాలని ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. శనివారం స్థానిక పాతూరులోని చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆలయ సిబ్బందితో అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మధుసూదన్‌తో పాటు ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ గౌస్, తహసీల్దార్ శ్రీధర్, శానిటేషన్ అధికారి ఆంజనేయులు, ఆలయ ఈవో వెంకటేశులు తదితరులు మాట్లాడారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని, భక్తులు అన్ని జాగ్రత్తలతో రావాలని సూచించారు. ఈసారి ఎలాంటి పాసులు, టిక్కెట్లు ఉండవని, అందరికీ ఉచిత దర్శనం కల్పిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్‌ ఉద్యోగుల క్రీడా పోటీల్లో రన్నర్స్‌గా 'అనంత'



రన్నర్స్‌ కప్‌తో జట్టు సభ్యులు

అనంతపురం టౌన్‌: నంద్యాల జిల్లా శ్రీశైలం ఏపీ జెన్‌కో విద్యుత్‌ కళావేదికలో నిర్వహించిన ఏపీ సర్కిల్‌ విద్యుత్‌ ఉద్యోగుల బాల్‌ బ్యాడ్మింటన్‌ పోటీల్లో అనంతపురం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా 24 జట్లు పాల్గొన్నాయి. వారం రోజులుగా పోటీల్లో ఉత్కంఠగా సాగాయి. శనివారం నిర్వహించిన ఫైనల్‌ మ్యాచ్‌లో విజయవాడ, అనంతపురం జట్లు తలపడగా... అనంతపురం జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులు ఏపీ జెన్‌కో సీఈ సుధీర్‌బాబు చేతుల మీదుగా ట్రోఫీ, ప్రశంసా పత్రాలను అందుకున్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్య



మృతుడు కిషోర్‌బాబు

ధర్మవరం అర్బన్‌: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా శింగనమల మండలం సలకం చెరువు గ్రామానికి చెందిన నాగరాజు, చంద్రకళ దంపతుల కుమారుడు యల్లారి కిషోర్‌ బాబు (28) ఎంబీఏ పూర్తి చేసి అనంతపురంలోని ఓ ప్రముఖ చెప్పుల కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేసేవాడు. కుటుంబ అవసరాల కోసం ప్రైవేట్‌ వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. ఈ క్రమంలో అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి వేధింపులు మొదలయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన కిషోర్‌ బాబు శుక్రవారం ధర్మవరంలోని వైభవ్‌ లాడ్జీలో గది అద్దెకు తీసుకుని బస చేశాడు. శనివారం సాయంత్రం విషపూరిత గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన లాడ్జీ నిర్వాహకుల సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కణేకల్లు ఫాం అక్రమాలపై రేపటి నుంచి విచారణ

అనంతపురం అగ్రికల్చర్‌: కణేకల్లులో వ్యవసాయ శాఖకు చెందిన విత్తన వరి క్షేత్రం (ఫాం)లో చోటు చేసుకున్న అక్రమాలపై ఈ నెల రెండో తేదీ నుంచి ఆడిట్‌ బృందం విచారణ చేపట్టనుంది. చీఫ్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ (సీఏఓ) శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ఐదుగురు అధికారులతో కూడిన విచారణ బృందం జిల్లాకు వస్తున్నట్లు సమాచారం. 140 ఎకరాల్లో విస్తరించిన కణేకల్లు ఫారంలో గత పదేళ్లుగా సాగు చేసిన వరి విస్తీర్ణం, పంట దిగుబడులు, చేసిన ఖర్చు, వచ్చిన ఆదాయం, ప్రభుత్వానికి చెల్లించిన సొమ్ము, తదితర వాటికి సంబంధించి కచ్చితమైన గణాంకాలు అందుబాటులో లేనందున... పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిన నేపథ్యంలో మరో బృందం విచారణకు వస్తుండడం గమనార్హం. ప్రధానంగా అసిస్టెంట్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌ (ఏడీఏ) స్థాయి అధికారి అక్కడ దీర్ఘకాలం పనిచేయడం, ఆయన కనుసన్నలలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన వేరే జిల్లాలో పనిచేస్తున్నా.... విత్తన వరి క్షేత్రం గోల్‌మాల్‌ వ్యవహారం ఆయన మెడకు చుట్టుకోనుంది. ఇంకా ఇందులో ఎవరెవరి హస్తముందనే అంశం వెలుగులోకి వచ్చే అవకాశమూ ఉంది.

నాడు దోపిడీ.. నేడు నీతులు

- టీడీపీ హయాంలో భారీగా మట్టి దోపిడీ
- కీలక నేత అండతో చెలరేగిన 'మట్టి'కాసురులు
- నాటి దోపిడీని వేలెత్తి చూపుతున్న ఆనవాళ్లు





టీడీపీ హయాంలో డి.హీరేహాళ్‌ మండలంలోని బీఐఓపీ వద్ద మట్టితవ్వకాలు (ఫైల్‌), టీ వీరాపురం చెరువులో మట్టిని తవ్వేసిన దృశ్యం (ఫైల్‌)

రాయదుర్గం: అనుమతుల్లేవ్‌.. అడిగేవాళ్లు లేరు. ఇంకేముంది.. కొండగుట్టలు, చెరువులు, ప్రభుత్వ పోరంబోకు భూముల్లో టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వేశారు. గతంలో అధికారంలో ఉన్న ఐదేళ్లు చెలరేగిపోయారు. రాయదుర్గం ప్రాంతంలో ఓ ముఖ్య నాయకుడి అండదండలతో మాఫియాను తలదన్నేలా మట్టి వ్యాపారం చేశారు. ఏకంగా రాష్ట్ర సరిహద్దు దాటించి రూ.కోట్లు వెనకేసుకున్నారు. వారి మట్టి దోపిడీకి ఆనవాళ్లు నేటికీ అలాగే మిగిలి ఉన్నాయి.

నేడు 'దొంగ'నాటకాలు

తాము అధికారంలో ఉన్నన్ని రోజులూ సహజ వనరులను ఇష్టానుసారంగా కొల్లగొట్టిన టీడీపీ నేతలు ..నేడు అధికార పార్టీ నాయకులపై అనవసర ఆరోపణలు చేస్తూ దొంగ నాటకాలకు తెర తీశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలు సొంత అవసరాలకు తరలించుకునే మట్టిని సైతం అధికార పార్టీ వారికి అంటగట్టేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఎక్కడ మట్టి ట్రాక్టర్‌ కన్పించినా అక్రమంగా తరలించేస్తున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు. వారి ఆగడాలకు 'ఎల్లో మీడియా' కూడా అండగా నిలుస్తోంది. ఏదో ఘోరం జరిగిపోయినట్టు చిత్రీకరిస్తోంది.

ఆనాటి అరాచకానికి సాక్ష్యాలివిగో..

- రాయదుర్గం నియోజకవర్గంలోని డి.హీరేహాళ్‌, రాయదుర్గం, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల్లో టీడీపీ హయాంలో మట్టిదోపిడీ యథేచ్ఛగా సాగించారు. టీ వీరాపురం చెరువులో ఎలాంటి అనుమతులూ లేకుండానే హిటాచీలు ఏర్పాటు చేసి 15 మీటర్ల లోతున తవ్వకాలు చేపట్టారు. టిప్పర్ల సహాయంతో రాత్రీ పగలు తరలించేశారు. ఆ గ్రామ ప్రజలు వ్యతిరేకించినా ఏమాత్రమూ లెక్కచేయలేదు.
- రాయదుర్గం పట్టణ సమీపాన నాన్‌చెరువులో సుమారు 20 మీటర్ల లోతుకు తవ్వకాలు చేపట్టి.. కుప్పలేసి మరీ మట్టిని విక్రయించారు.
- డి హీరేహాళ్‌ మండలం ఓబుళాపురం సమీపాన బీఐఓపీ ఫ్యాక్టరీ వద్ద ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి బళ్లారికి తరలించారు. వీటన్నింటిలోనూ ముఖ్యనాయకుడి హస్తం ఉన్నట్లు అప్పట్లో పెద్దఎత్తున విమర్శలు వినిపించాయి.
- టీడీపీ హయాంలో అడ్డగోలుగా వేసిన వెంచర్లకు సైతం మట్టిని తరలించి సొమ్ము చేసుకున్నారు.

కాలవ కనుసన్నల్లోనే దోపిడీ



టీడీపీ హయాంలో అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు కనుసన్నల్లోనే ఎర్రమట్టి దోపిడీ సాగింది. వివిధ ప్రాంతాల్లో రేయింబవళ్లు మట్టి తరలించారు. వారి ఆగడాలను ఆనాడు ఎవరూ అడ్డుకోలేదు. టీడీపీ నేతలు ఇప్పుడు నీతులు మాట్లాడుతుండడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది.

– నరసింహులు, కణేకల్లు

సరిహద్దు దాటించారు



టీడీపీ హయాంలో ఓబుళాపురం పరిసరాల్లోని కొండల్లో నుంచి ఎర్రమట్టిని భారీగా రవాణా చేశారు. ఎన్‌హెచ్‌-150 మీదుగానే బళ్లారికి తరలించి, సొమ్ము చేసుకున్నారు. సరిహద్దులో చెక్‌పోస్టు ఉన్నా.. ఏనాడూ అడ్డగించిన దాఖలాలు లేవు. కాలవ అండతోనే మట్టిమాఫియా చెలరేగింది. వారు తవ్విన ఆనవాళ్లు నేటికీ అలాగే ఉన్నాయి.

– హెచ్‌.గాదిలింగప్ప, ఓబుళాపురం, డి హీరేహాళ్‌

గుత్తిలో ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస ప్రచారం



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

గుత్తి: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ స్థానానికి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో దిగిన వెన్నపూస రవీంద్రారెడ్డి శనివారం గుత్తిలో పర్యటించారు. తొలుత మహర్షి దయానంద గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, యాజమాన్యంతో సమావేశమై మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని భరోసానిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం పలు పాఠశాలలను సందర్శించి, తనకు ఓటు వేయాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణరెడ్డి, మహర్షి పాఠశాల కరస్పాండెంట్లు వేదమూర్తి, విద్యాధర్‌, హెచ్‌ఎం ఇమ్రాన్‌, ఉపాధ్యాయులు, పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీని విజయవంతం చేయండి

- సచివాలయ కన్వీనర్లకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా పిలుపు



పుట్లూరు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేస్తున్న ఘనత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. శనివారం ఆయన పుట్లూరు మండలం ఎ.కొండాపురంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అవ్వ, తాతలకు పింఛన్‌ మొత్తాన్ని రూ.2,500ల నుంచి రూ.2,750లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పెంచిన మొత్తాన్ని 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారని, ఈ ప్రక్రియను సచివాలయ కన్వీనర్లు దగ్గరుండి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇందు కోసం స్థానిక ప్రజా ప్రతినిధులు, వలంటీర్లను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. పింఛన్‌ పంపిణీ సందర్భంగా జగనన్న సందేశాన్ని లబ్ధిదారులకు వినిపించాలన్నారు.

జగన్‌ హయాంలోనే 'సహకార' పురోభివృద్ధి

- 2022లో రూ.1,500 కోట్ల టర్నోవర్‌
- 2023లో రూ.2 వేల కోట్ల లావాదేవీల లక్ష్యం
- క్యాలెండర్‌ ఆవిష్కరణలో డీసీసీబీ చైర్‌పర్సన్‌ ఎం.లిఖిత



క్యాలెండర్‌ ఆవిష్కరిస్తున్న లిఖిత, తదితరులు

అనంతపురం అగ్రికల్చర్‌: సహకార బ్యాంకుల ఆర్థిక పరిపుష్టి కోసం సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో గత ఏడాది(2022) ఆర్థిక లావాదేవీల్లో గణనీయ పురోగతి సాధించినట్లు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్‌పర్సన్‌ మానుకింద లిఖిత అన్నారు. శనివారం స్థానిక డీసీసీబీ హాలులో 2023 నూతన సంవత్సరం క్యాలెండర్‌ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ సీఈఓ ఏటీ రామ్‌ప్రసాద్‌తో కలసి ఆమె 2022లో బ్యాంకు అందించిన సేవలు, సాధించిన ప్రగతి, 2023 కార్యాచరణను వివరించారు.

సేవలు మరింత విస్తృతం

గత ఏడాది 40 శాతం అభివృద్ధితో రూ.1,500 కోట్ల టర్నోవర్‌ను అధిగమించడంపై లిఖిత హర్షం వ్యక్తం చేశారు. బంగారు తాకట్టుపై రూ.100 కోట్లు, మహిళా సంఘాలకు రూ.75 కోట్లు రుణాలు మంజూరు చేసినట్లు గుర్తు చేశారు. పొదుపులో భాగంగా పెద్ద ఎత్తున డిపాజిట్ల సేకరణతో పాటు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 8.61 శాతానికి తగ్గించినట్లు వివరించారు. 12 ఏళ్ల తర్వాత 66 మందికి ఉద్యోగాలు కల్పించి నూతన సాంకేతిక పరిజ్ఞానం, మానవ వనరుల అభివృద్ధి, బ్యాంకింగ్‌ సేవలు విస్తృతం చేసినట్లు తెలిపారు. 2022 స్ఫూర్తితో 2023లో బ్యాంకు టర్నోవర్‌ను రూ.2 వేల కోట్లకు చేరుస్తామన్నారు. ప్రతి మండలానికి ఒక బ్యాంకు శాఖ ఉండేలా విస్తరిస్తామన్నారు. అన్ని వర్గాలకు అన్ని రకాల రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గృహ, వాహన, బంగారు నగల తాకట్టు రుణాలు పెంచుతామన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్‌) కంప్యూటరీకరణ పూర్తి చేస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్‌ వాణిజ్య బ్యాంకులకు దీటుగా డీసీసీబీల ద్వారా ఖాతాదారులు, రైతులకు ఆధునిక బ్యాంకింగ్‌ సేవలు అందిస్తామన్నారు. ప్రభుత్వం, పాలక వర్గం, అధికారులు, సిబ్బంది సహకారంతో 2023లో డీసీసీబీని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జగన్‌ సర్కారుకు ధన్యవాదాలు

ఆప్కాబ్‌, నాబార్డుతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు, జగనన్న పాలవెల్లువ, స్నేహమిత్ర, ఫిష్‌ ఆంధ్రా, పీఎం స్వనిధి, పంట రుణాలు, మహిళా సంఘాలకు రుణాలు, రైతులకు సీహెచ్‌సీల కింద ట్రాక్టర్లు, యంత్ర పరికరాలకు రుణాల మంజూరులో సహకార బ్యాంకులను భాగస్వామ్యం చేసిన సీఎం వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో డీసీసీబీ మాజీ చైర్మన్‌ పామిడి వీరాంజనేయులు, డైరెక్టర్లు పాటిల్‌ శంకరరెడ్డి, కారుణ్య, హైదర్‌వలీ, రామాంజినేయులు, జీఎం కె.సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, దినేష్‌ కుమార్‌, అసోసియేషన్‌ నాయకులు పాల్గొన్నారు.

128 క్వింటాళ్ల రేషన్‌ బియ్యం స్వాధీనం



బియ్యం బస్తాలు చూపుతున్న విజిలెన్స్‌ అధికారులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న 128.50 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని విజిలెన్స్‌ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్‌ డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపిన మేరకు... శనివారం నగరంలోని తపోవనం కూడలి వద్ద విజిలెన్స్‌ అధికారులు తనిఖీలు చేపట్టారు. 44వ జాతీయ రహదారిపై వస్తున్న టీఎస్‌ 33టీ 0459 నంబరు గల లారీని ఆపి తనిఖీ చేయగా, 128.50 క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని గుర్తించి, వాహనాన్ని సీజ్‌ చేశారు. ఇందుకు సంబంధించి గద్వాల్‌ జిల్లా, అలంపూర్‌ ప్రాంతానికి చెందిన తెలుగు రామాంజనేయులు, వనపర్తికి చెందిన ఖాదర్‌బాషా, తెలుగు కుక్కల నడిపి చిన్నయ్య, కర్నూలు జిల్లా పత్తి కొండకు చెందిన లారీ యజమాని రామచంద్రారెడ్డి (వ్యాపారి)ను అరెస్ట్‌ చేశారు.

రూ.కోటి మాయం కేసులో పురోగతి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: స్థానిక గుత్తి రోడ్డు సమీపంలోని ఓ బార్‌ యజమాని వెంకటాద్రి బ్యాంక్‌ ఖాతా నుంచి మాయమైన కోటి రూపాయల కేసులో అనంతపురం వన్‌టౌన్‌ పోలీసులు పురోగతి సాధించారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు డిసెంబరు 24న వెంకటాద్రికి చెందిన ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాని సైబర్‌ నేరగాళ్లు హ్యాక్‌ చేసి, పలు దఫాలుగా ఖాతా నుంచి రూ.కోటి మాయం చేశారు. ఆలస్యంగా ఈ విషయాన్ని తెలుసుకున్న యజమాని వెంటనే పోలీసులను ఆశ్రయించారు. కేసును సవాలుగా స్వీకరించిన వన్‌టౌన్‌ పోలీసులు న్యూఢిల్లీలోని అశోక్‌ విహార్‌ ప్రాంతంలో ఉన్న రత్నాకర్‌ బ్యాంక్‌ లిమిటెడ్‌లోని ఓ ఖాతాకు నగదు చేరినట్లుగా గుర్తించి, ఆ బ్యాంక్‌ అధికారుల సాయంతో నిందితులను గుర్తించారు. ఆ ఖాతా నుంచి మరో నలుగురి ఖాతాలకు డబ్బు బదిలీ అయినట్లు తెలిసింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, కీలక నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

నగరంలో దొంగల హల్‌చల్‌



షట్టర్‌ వంచేందుకు రాడ్‌తో ప్రయత్నిస్తున్న దుండగుడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: అనంతలో అర్ధరాత్రి దొంగలు హల్‌చల్‌ చేశారు. 44వ జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న నాలుగు కారు డెకర్స్‌ దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. శనివారం వేకువజామున కారులో వచ్చిన ఇద్దరు దుండగులు జనశక్తి నగర్‌ వైపు ఉన్న అమరావతి కార్‌ డెకర్స్‌ దుకాణం షెట్టర్‌ను ఇనుప చువ్వలతో మెండి లోపలకు చొరబడ్డారు. లాకర్‌లో దాచిన రూ.లక్ష నగదు, తమ కదలికలను నిక్షిప్తం చేసిన సీసీ కెమెరాల హార్డ్‌ డిస్క్‌లను అపహరించారు. అనంతరం హరిహర కార్‌ డెకర్స్‌లో చొరబడి రూ.5 వేలు తీసుకుని ఉడాయించారు. తర్వాత ఆ పక్కనే ఉన్న మరో డెకర్స్‌ దుకాణంలోకి చొరబడే ప్రయత్నం చేయడంతో వీధికుక్కలు మొరగడంతో ఆ ప్రయత్నం విరమించుకుని తపోవనం కూడలిలోని ఇండియన్‌ రెగ్జిన్‌ దుకాణంలో చొరబడి రూ.60 వేలు, లాకర్‌లో ఉన్న కారు బీగాలు తీసుకుని పార్కింగ్‌ చేసిన కారును అపహరించేందుకు ప్రయత్నించారు. కుదరక పోవడంతో అక్కడే వదిలేశారు. అనంతరం దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్‌ డిస్క్‌ను అపహరించుకెళ్లారు. ఉదయాన్నే చోరీ ఘటనలు గుర్తించిన దుకాణదారులు ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని వెంటనే నాల్గో పట్టణ పోలీసులకు చేరవేశారు. ఘటన స్థలాలను పోలీసులు పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆటోను ఢీకొని యువకుడి మృతి



రంజిత్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌)

కళ్యాణదుర్గం: ఆటోను ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ యువకుడు మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ముదిగల్లుకు చెందిన సావిత్రమ్మ, రుద్రన్న, రామాంజనేయులు శనివారం ఉదయం ఓ ఆటోలో రాయదుర్గం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. ముదిగల్లు బైపాస్‌ రోడ్డుకు చేరుకోగానే బోరంపల్లికి చెందిన రంజిత్‌కుమార్‌ రెడ్డి (17), కళ్యాణదుర్గం నివాసి సాయికృష్ణ ఒకే ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన రంజిత్‌ కుమార్‌రెడ్డి, సాయికృష్ణను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. చికిత్సకు స్పందించక శనివారం రాత్రి రంజిత్‌కుమార్‌రెడ్డి మృతి చెందాడు. కాగా, ఇదే ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురూ స్వల్పంగా గాయపడ్డారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పంటల సాగులో యాజమాన్యం అవసరం

బుక్కరాయసముద్రం: పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ సహదేవరెడ్డి సూచించారు. పంటల సాగుపై శనివారం పరిశోధనా స్థానంలో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంట మార్పిడి విధానంతో మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. ఒకే పంటను తరచూ సాగు చేయరాదన్నారు. రబీ పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్యం పద్ధతులు వివరించారు. అనంతరం రేకులకుంటలో సాగు చేసిన పంటలను పరిశీలించారు.

పోలీస్‌ కస్టడీకి తుపాకీ ముఠా

కళ్యాణదుర్గం: ఇటీవల డి.హీరేహాళ్‌ వద్ద పట్టుబడి, జుడీషియల్‌ కస్టడీలో ఉన్న తుపాకుల ముఠా సభ్యులు ఆరుగురిని విచారణ నిమిత్తం పోలీస్‌ కస్టడీకి తీసుకున్నారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం కళ్యాణదుర్గం సబ్‌ జైలులో ఉన్న నిందితులను డీఎస్పీ శ్రీనివాసులు నేతృత్వంలో పటిష్ట బందోబస్తు మధ్య జిల్లా కేంద్రానికి పోలీసులు తరలించారు. అయితే ఈ ప్రకియ బయటకు పొక్కకుండా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. రహస్య ప్రదేశంలో నిందితులను విచారణ చేయనున్నట్లు తెలిసింది.

ముగిసిన పీఎస్‌ఓ రిఫ్రెష్‌ కోర్సులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్‌: జిల్లాలోని పీఎస్‌ఓ (గన్‌మెన్‌)ల రిఫ్రెష్‌ కోర్సు శనివారంతో ముగిసింది. ఈ కోర్సులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ఏఆర్‌ అదనపు ఎస్పీ హనుమంతు బహుమతులు ప్రదానం చేశారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్‌ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఐ భాస్కర్‌తో పాటు పలువురు ఏఆర్‌ సిబ్బంది పాల్గొన్నారు.

భార్య చేతిలో భర్త హత్య

సోమందేపల్లి: భార్య చేతిలో భర్త దారుణ హత్యకు గురైన ఘటన శనివారం మండలంలోని మంచేపల్లిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌ కుమార్‌ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన రామాంజనప్ప (38) తాగుడుకు బానిసయ్యాడు. కొన్ని రోజులుగా భార్య రాజమ్మతో తరచూ గొడవకు దిగుతున్నాడు. శుక్రవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కోపోద్రిక్తురాలైన రాజమ్మ శనివారం తెల్లవారుజామున నిద్రిస్తున్న రామాంజనప్ప తలపై కర్రతో బలంగా బాదడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి పోలీసులు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
అనంతపురం
ఆదివారం ॥ 1-1-2023

2023 - ఆకాంక్షలు



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక!

కొలం చల్లటి నీడనిచ్చే చెట్టు కావాలి. వడగాడ్పు నుంచి, ఊపి కొట్టే వాన నుంచి, గడ్డ కట్టే చలి నుంచి అది మనుషులను కాయాలి. పంటలు సమృద్ధిగా పండాలి. తియ్యటి మామిడిపండ్లు బండ్ల కొద్దీ మండీలకు చేరాలి. పూలు సలీసుగా దొరకాలి. కొలనుల్లో చేపల వీపులను తామరతూడులు తడమాలి. నదులు ఒండ్రుమట్టిని ఒడ్డుకు తోస్తూ ప్రవహించాలి. సముద్రాలు శాంత వచనాలు పల కాలి. మహమ్మారులు తోకలు ముడవాలి. ఒకటీ అరా మాత్రలతో తగ్గిపోయే రోగాలే చలామణిలో ఉండాలి. నాలుగు గోడలు లేపినవాడు పైకప్పు వేసుకోగలగాలి. గూడే లేని వాడు ఇంత జాగా సంపాదించుకోవాలి. ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా చేతికందాలి. కాయకష్టం చేసేవాడు బువ్వకు లోటెరగక ఉండాలి. పాలకులు పెద్ద మనసు చేసుకోవాలి. కట్నాలు, లాంఛనాల జంజాటాలు లేక అప్పుల బెంగ ఎరగని పెళ్లిళ్లు జరగాలి. ఆడపిల్లలు సగౌరవంగా, సురక్షితంగా ఉండాలి. స్త్రీల గెలుపు గాథలు వినిపించాలి. యువతీ యువకుల సబబైన ఇష్టాలు చెల్లుబాటు కావాలి. రహదారులు క్షేమమార్గాలుగా విలసిల్లాలి. సమాజం శాంతితో నిండాలి. అశాంతి కొరకు ప్రయత్నించే ప్రతి చర్యా చతికిలపడాలి. హేతువుకు చోటు దక్కాలి.

ప్రతి ఇల్లు పాలు తేనెల సమృద్ధితో నిండాలి. తాతయ్య, నానమ్మలు కులాసాగా ఉండాలి. అమ్మ చెప్పినట్టు అందరూ వినాలి. నాన్న జేబు ఎప్పుడూ నిండుగా ఉండాలి. పిల్లలు సదా పకప కలాడాలి. చదువులెన్నో బుద్ధిగా చదవాలి. బంధువులందరూ బలగంగా ఉండాలి. స్నేహితులందరూ శక్తిగా మారాలి. కొత్త సంవత్సరం అందరికీ శుభాలు తేవాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి.

మంచిని తలుద్దాం. విశ్వం వింటుంది.
గట్టిగా అనుకుందాం. తప్పక నెరవేరుతుంది.
హ్యాపీ న్యూ ఇయర్.





* ఎంపిక

న్యూఇయర్ గిఫ్ట్

న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి ఆనందాన్ని పంచుకోవాలనుకుంటారు. అందుకు ఖరీదైన కానుకలనే ఎంచుకోనక్కర్లేదు. మీరిచ్చే బహుమతి ఆశ్చర్యాన్ని కలిగించనక్కర్లేదు. సానుకూలమైన ఆలోచనలు కలిగించేవిగా ఉంటే చాలు. కొన్ని నెలల తర్వాత చెత్త బుట్టలో పడేసే వాటిని ఇచ్చే బదులు తక్కువ ఖర్చుతో పర్యావరణ స్నేహపూర్వక కానుకలను ఇస్తే అన్ని చోట్లా ఆనందం రెట్టింపు అవుతుంది.

పెయింట్ వేసిన కుండీలు

ఇండోర్ లేదా అవుట్ డోర్‌లలో అందమైన పెయింట్ చేసిన మొక్కల కుండీలను కూడా అలంకరణకు వాడుతుంటారు. స్వయంగా పెయింట్ చేసిన కుండీలను కూడా కానుకకు ఎంపిక చేసుకోవచ్చు.



పచ్చని కానుక

మొక్కలను ప్రేమించనివారుండరు. అవి ఇండోర్ లేదా అవుట్ డోర్ కావచ్చు. గృహాలంకరణలోనూ మొక్కలకు కొంత ప్లేస్‌ను కేటాయిస్తుంటారు. ఇలాంటి అభిరుచి గలవారికి చిన్న చిన్న మొక్కలు ఉన్న కుండీలను కానుకగా ఇవ్వచ్చు. విత్తన ప్యాకెట్లను ఎంపిక చేసి ఇవ్వచ్చు. స్థానికంగా ఉన్న నర్సరీలో మొక్కల కొనుగోలుకు కొంత మొత్తం చెల్లించి, ఆ రసీదును కానుకగా ఇవ్వచ్చు. ఆ రసీదుతో వారే తమకు కావల్సిన మొక్కలను ఎంచుకుంటారు.





క్లే బాటిల్.. ఉడెన్ స్పూన్స్

పర్యావరణ హితమైన వాటిలో నిత్యం ఉపయోగపడేవి ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో స్టోరేజీ బాస్కెట్, క్లే బాటిల్స్, ఉడెన్ స్పూన్స్, టెర్రకోట షోకేస్ లేదా కిచెన్ ఐటమ్స్, జూట్ బ్యాగ్స్.. ఇతర యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవచ్చు.



రీ సైక్లింగ్..

ఫాస్ట్ ఫ్యాషన్‌లో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో మనవైన సంప్రదాయ హస్తకళలతో రూపుదిద్దుకున్న అలంకార వస్తువులను కానుకగా ఇవ్వచ్చు. వాటిలో ఫ్యాబ్రిక్, థ్రెడ్, ఉడెన్, టెర్రకోట జ్యువెలరీ, ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్స్.. వంటివి ఎంచుకోవచ్చు. **ఇలాంటి ప్రత్యేకమైన కానుకలు సందర్భానికి తగిన విధంగా ఇస్తే ఆత్మీయులను మరింత చేరువ చేస్తాయి.**



బ్యూటిప్స్

బాదం గింజల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి పోషణను అందిస్తుంది. అలాగే నిర్జీవంగా మారిన చర్మకణాలకు జీవం పోస్తుంది. పాలు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తాయి.

ఐదు నుంచి ఆరు బాదం గింజలను తీసుకొని వాటిని నానబెట్టాలి. బాగా నానిన తర్వాత వాటి తొక్క తీసి గింజలను పేస్ట్‌లా తయారు చేయాలి. ఆపై కొద్దిగా పాలు కలిపి ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఫేస్ ప్యాక్ చర్మానికి ఇన్‌స్టంట్ బ్రైట్ నెస్ అందించడం మాత్రమే కాకుండా చర్మాన్ని అందంగా, మృదువుగానూ మారుస్తుంది. కాబట్టి దీనిని రెగ్యులర్ ఫేస్ ప్యాక్స్ మాదిరిగానూ ఉపయోగించవచ్చు.



ముగ్గు ముచ్చట



21 చుక్కలు : 21 వరసలు



మద్దల పద్మావతి
పెండోటవారి వీధి, తెనాలి



సరస్వతి
తాండూరు

18 చుక్కలు : 18 వరసలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

* అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సంవత్సర ఫలాలు



2023. ఈ సంవత్సరం అంకెలు మొత్తం కూడితే 2+0+2+3=7, వస్తుంది. 7 అంకె కేతుగ్రహానికి సంకేతం. దీని ప్రభావం వలన వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, పురాతన గ్రంథాలు, మరుగున పడిన తాంత్రిక విద్యలు, ఆయుర్వేదం, జ్యోతిషం వంటి విద్యలలో సృజనాత్మక మార్పులు, అభివృద్ధి జరుగుతాయి. వైద్య విద్య, వైద్య పరిశోధనలపై ప్రజలకు, ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగంపై విద్యార్థులలో ఆసక్తి ఎక్కువ అవుతుంది. స్టాక్ మార్కెట్‌పై కూడా ఆసక్తి పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ ఫిబ్రవరి వరకు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఫిబ్రవరి 2023 తరువాత లాభదాయకంగా ఉంటుంది.

ఈ 2023 సంవత్సరం మొత్తం అంకెలు కలపగా 7 వస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం మొత్తం కేతు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా జ్యోతిషపరంగా చూసినా 2023 సంవత్సరం ఆదివారం, అశ్విని నక్షత్రం (01-01-2023)తో ప్రారంభం అయ్యి, ఆదివారం, మఖ నక్షత్రం (31-12-2023)తో ముగుస్తుంది. ఈ విధంగా ఈ సంవత్సరం కేతు నక్షత్రం (అశ్విని)తో మొదయ్యి, కేతు నక్షత్రం (మఖ)తో ముగుస్తుంది. అందువలన కేతు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఈ 2023 శోభకృత్ నామ సంవత్సరంలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. కష్టాల నుండి విముక్తి కలిగి ఆత్మజ్ఞానం, తాత్విక జ్ఞానం, ఆత్మాభిమానం కలిగి మంచి పాజిటివ్ ఆలోచనలు కలిగి ప్రజలు అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తారు.

1, 10, 19, 28 తేదీలలో జన్మించినవారికి 2023 సంవత్సరంలో సూర్య, చంద్ర, కేతు గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. గురు ప్రభావం వలన ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పరిశోధన, మైనింగ్ రాజకీయ రంగాలలో ఉన్న వారికి నూతన అవకాశాలు. బాధ్యతలు పెరుగుతాయి. దీనితోపాటు ఆర్థికవృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త పథకాలు, వ్యాపారాల ద్వారా లాభాలు గడిస్తారు. విదేశాలలో విద్య, ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఇది మంచి సమయం. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అవివాహితులకు వివాహ యోగం. వైవాహిక జీవితంలో ఉన్నవారికి స్పర్థలు, అపోహలు తొలగి మంచి వైవాహిక జీవితం గడుపుతారు. భార్య/భర్త ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. నైతికత, విలువలు పాటించాలి. లేకపోతే సన్నిహితులు మిత్రులు దూరం అయ్యే అవకాశం ఉంది. అహంభావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో సామాజికంగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. కోర్టు కేసుల్లో అనుకూలమైన తీర్పులు వస్తాయి.

ఆరోగ్యం మెరుగుపడుతుంది. మంచి ఆలోచనలు కలిగి మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి. విద్యలో పూర్తి చేయని కోర్స్‌లు ఉంటే అవి పూర్తి చేస్తారు. డిగ్రీ చేతికి వస్తుంది.

పరిశోధనా రంగం వైద్య రంగం జ్యోతిషం తాంత్రిక విద్యలు మొదలైన రంగాలలో ఉన్నవారికి 2023 సంవత్సరం చాలా మంచి సంవత్సరం. అధిక ఒత్తిడి తీసుకోకుండా శాంతంగా ఉంటూ అహంభావాన్ని విడిచి పెట్టి ప్రయత్నిస్తే ఈ సంవత్సరం మీ జీవితంలో నూతన అధ్యాయానికి నాంది అని చెప్పవచ్చు. దుర్గా సప్తసతి పారాయణ వలన మంచి ఫలితాలు పొందుతారు.

2, 11, 20, 29 తేదీలలో పుట్టినవారికి న్యూమరాలజీ ప్రకారం 2,7 చంద్రునికి సంబంధించిన అంకెలు. ఈ సంవత్సరంలో వీరికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అవివాహితులకు వివాహయోగం. సృజనాత్మకత పెరుగుతుంది. రచయితలకు,నటులకు, కళాకారులకు ఇది మంచి సమయం. నటులకు, కళాకారుకి మంచి అవకాశాలు దొరికి, చిత్ర రంగంలో మంచి పేరు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో సమాచార రంగం బాగుంటుంది. ఈ సంవత్సరం 23 సంఖ్య (2+3) కాబట్టి 5 బుధుడి సంఖ్య. దీనివలన స్టాక్ మార్కెట్‌లో అభివృద్ధి ఉంటుంది. సంవత్సర సంఖ్యలోని 3 గురుడుకి సంబంధించి సంఖ్య కావటం వలన పుట్టిన తేదీ (2,11,20,29) చంద్రుడికి సంబంధించినది కావటం వలన చంద్ర గురువుల కలయిక వలన రాజ యోగం కలుగుతుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. పాత మిత్రులను కలుస్తారు. కార్యాలయంలో గుర్తింపు వస్తుంది. గమ్యాలను చేరుకోగలుగుతారు. చాలా కాలంగా విదేశాలలో ఉన్నవారు స్వదేశం వస్తారు. అప్పు కోసం ప్రయత్నించేవారికి అప్పు దొరుకుతుంది. ఆకర్షణ శక్తి పెరిగి స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణ, విలాస వస్తువులు కొంటారు. నగదు కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందువలన జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. హీలింగ్ చేసేవారికి, వక్తలకు ఇది మంచి సమయం. విష్ణు సహస్ర నామం పారాయణం, శ్రవణం చేయటం, రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ వలన మంచి ఫలితాలు వస్తాయి. మీ ఆదాయంలో 2 నుంచి 10 శాతం వికలాంగులకు దానం చేయటం వలన మీ వృత్తిలో ఆదాయ వృద్ధి కలుగుతుంది.

3, 12, 21, 30 తేదీలలో జన్మించినవారికి గురు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరు నిరంతరం శక్తి సంపన్నులుగా, ఆశావాదులుగా ఉండి తమ ప్రతిభ ద్వారా ఇతరుల కంటే ఎక్కువగా రాణిస్తారు. వీరిపై బుధ, గురు, కేతు ప్రభావం ఉంటుంది. ఈ సంవత్సరంలో ఏ వయసు వారైనా కొత్త పరిజ్ఞానాన్ని పొందుతారు. వృత్తివిద్యలు, నూతన సాంకేతిక విద్యలు నేర్చుకుంటారు. విద్యార్థులకు మంచి సమయం. విదేశీ విద్య కోరిక నెరవేరుతుంది. వీరికి ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో నిర్మాణాత్మకంగా ఉంటుంది. మధ్యలో చదువు ఆపినవారు కొత్త కోర్సులు చేయాలనే కోరిక కలిగి ముందుకు వెళతారు. ఈ సంవత్సరంలో గౌరవ పట్టాలు పొందుతారు. వ్యవసాయదారులకు ఆదాయం పెరుగుతుంది. వేరుసెనగలు, కందులు, పసుపు పండించేవారికి లాభదాయకం. కొత్తకొత్త వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. సంతానం ఉన్నవారి పిల్లలు ఉద్యోగం వచ్చి సెటిల్ అవుతారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. షేర్‌మార్కెట్‌లో లాభాలు వస్తాయి. తండ్రికి మంచి సమయం. విదేశీ పర్యటన, పుణ్యక్షేత్రాల దర్శనం జరుగుతాయి. ఈ సంవత్సరంలో తీసుకొనే నిర్ణయాల వలన వచ్చే సంవత్సరంలో లాభాలు వస్తాయి. నైతికంగా ఉండాల్సిన అవసరం ఉంది. మే నుండి పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

దక్షిణామూర్తిని కొలవటం వలన మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో 2 నుంచి 10 శాతం పేద విద్యార్థులకు గురువులకు, ఇంటి పురోహితులకు దానం చేయటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

4, 13, 22, 31 తేదీలలో జన్మించినవారిపై రాహు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాహు గ్రహం మీద చాలా మందికి వ్యతిరేకత, అపోహలు ఉంటాయి. కానీ రాహు సంఖ్య 4 చాలా మంచి సంఖ్య. వీరు నిర్మాణాత్మక వైఖరి, వాస్తవిక పంథా, స్థిరత్వం, నైపుణ్యం, ప్రశాంతత శాస్త్రీయమైన బాధ్యతాయుతమైన ఆలోచన, కష్టించే గుణం నిజాయితీ, విశ్వాస పాత్రత, పట్టుదల కలిగి ఉంటారు.

బుధ రాహుల కలయిక వీరిని గొప్ప నిపుణులుగా చేస్తుంది. రాహు అంటే కొత్త సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండటం. ఏ వయసులోవారైనా కొత్త టెక్నాలజీ నేర్చుకోవటం, ఆ రంగంలో ఉన్నవారు నూతన ఆవిష్కరణలు చేయటం, దాని వలన పేరు ప్రఖ్యాతులు, సంపద పొందటం జరుగుతుంది. కోర్టు కేసులలో విజయం లభిస్తుంది. వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. వివాదాలలో ఉన్న వీరి స్థలం వీరికి లభిస్తుంది. కొత్త ఇల్లు కట్టుకుంటారు. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. రెండో పెళ్ళి కోసం ఎదురు చూసేవారికి ద్వితీయ వివాహం జరుగుతుంది. సంవత్సర సంఖ్యలో 3, జన్మ తేదీ రాహు సంఖ్య అవ్వటం వలన గురు ఛండాల యోగం పడుతుంది. కాబట్టి వీరు ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు ఆలోచించి విజ్ఞుల సలహాలు తీసుకొని చేస్తే మంచిది. గురు ఛండాల యోగం ఉన్నందున ప్రేమ వ్యవహారాలు, రిలేషన్ షిప్‌లో ఉండటం మంచిది కాదు. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టమైన ఎన్నికలలోనైనా గెలుస్తారు.

సర్పదోష నివారణ పూజ, దక్షిణామూర్తి పూజ సుబ్రహ్మణ్య స్వామి పూజ చేయటం వలన మంచి జరుగుతుంది. పేదలకు, అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

5, 14, 23 తేదీలలో జన్మించినవారు బుధ గ్రహ ప్రభావం వల్ల వీరు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉంటారు. క్రియాశీలత, సేచ్ఛా ప్రియత్వం, వినోదం, ఉల్లాసం, మంచి, ఆలోచనలు, తెలివి తేటలు, కార్య దక్షత కలిగి ఉంటారు. 2023 సంవత్సరం లో వీరిపై కేతుప్రభావం ఉంటుంది. సంవత్సరం 23(5) కాబట్టి బుధ ప్రభావం ఉంటుంది. వీరి జన్మతేదీ, సంవత్సర సంఖ్య రెండూ 5 కావడం వల్ల బుధ ప్రభావతో వీరి తెలివి తేటలకు, కార్య నిర్వహణకు గుర్తింపు వస్తుంది. పబ్లిక్ రిలేషన్స్, సేల్స్, పర్యాటక రంగం టీవీ, సినిమా పత్రికా రంగాలలో ఉన్నవారైతే మంచి గుర్తింపు వస్తుంది. వ్యవసాయదారులకు కూరగాయలు చెరుకు, పెసలు, మినుములు పండించేవారికి లాభదాయకంగా ఉంటుంది. వీరు కొత్త భూములు, పొలాలు కొనే అవకాశం ఉంది. పెట్టుబడులకు ఇది మంచి సమయం. వ్యాపారస్తులకు లాభాలు వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వ్యాపార లావాదేవీలలో డాక్యుమెంట్లపై సంతకం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ఇది మంచి సంవత్సరం. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులు వేరే మంచి ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నోటిని అదుపులో ఉంచుకోకపోతే అవమానాలు జరుగుతాయి. ఆరోగ్యానికి సంబంధించి పంటి, కంటి పరీక్షలు చేయించుకోవాలి.

గణపతి ఆరాధన, రుద్రాభిషేకం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో రెండు నుంచి 10 శాతం దానం చేయటం మంచిది.

6, 15, 24 తేదీలలో జన్మించినవారు శుక్ర గ్రహ ప్రభావం వల్ల వీరికి కళాభిరుచి, సృజనాత్మకత, మానవ సేవ, విశ్వాస పాత్రత వంటి లక్షణాలు ఉంటాయి. త్యాగబుద్ధి, సేవాభావం కలిగి ఉంటారు. శుక్ర, బుధ సంబంధం వలన ఈ సంవత్సరం వైద్యం, జ్యోతిషం, తాంత్రిక సంబంధిత వృత్తుల వారికి చాలా మంచి కాలం. వైద్యులు నూతన వైద్యశాలలు ప్రారంభించే అవకాశం ఉంది. ఏ రంగంలో ఉన్నవారైనా ఆయా రంగాలలో పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తారు. అవివాహితులకు వివాహ యోగం. ఈ సంవత్సరంలో వీరు ఎంతో ఆత్మతృప్తిని పొందుతారు. సంవత్సరమంతా చాలా రిలాక్స్‌డ్‌గా ఉంటారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. విదేశాలలో ఉన్నవారు స్వదేశం వచ్చి ఆనందంగా గడుపుతారు. విలాస వస్తువులు కొంటారు. ఊహించని ఆస్తి ప్రాప్తిస్తుంది. నటులు, సంగీతకారులకు, మీడియావారికి, నగల వ్యాపారులకు అనుకూలం. భాగస్వాములతో జాగ్రత్తగా ఉండాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉండటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలకు ఆహారం పెట్టడం, బీదవారికి దుప్పట్లు దానం చేయటం మంచిది. భృగు పాశుపత హోమం లేదా సుదర్శన హోమం చేయించుకోవటం మంచిది.

7, 16, 25 తేదీలలో జన్మించినవారిపై కేతు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరికి తాత్విక చింతన, మానవాతీత శక్తులు ఉంటాయి. ఆధ్యాత్మికత మీద దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సర సంఖ్య కూడా 2023(7) కేతు సంఖ్య. ఎవరికైనా జన్మ తేదీ, సంవత్సర సంఖ్య ఒక్కటిగా ఉన్నప్పుడు , వారిపై ఆ గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వారు వారి రంగాలలో చక్కగా రాణిస్తారు. మంచి గుర్తింపు వస్తుంది. ఈ తేదీలలో పుట్టినవారు నర్సులు, వైద్యులు, డ్రగ్గిస్టులు, పురోహితులు, జ్యోతిషులుగా ఉంటారు. ఈ రంగాలలో ఉన్నవారికి ఈ సంవత్సరం అత్యంత లాభదాయకం అని చెప్పవచ్చు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్ళాలనుకొనేవారి కోరిక నెరవేరుతుంది. పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. వీరికి యోగా, ధ్యానం వంటి విషయాలపై మక్కువ ఎక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తల దూర్చకుండా ఉంటే మంచిది. కోర్టులకి, పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళకుండా, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటం మంచిది. ఈ సంవత్సరం షేర్ మార్కెట్, స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటే మంచిది. వీరిలో అసాధారణ స్ఫురణ అధికంగా ఉండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటిస్తారు. వీరు వీరి రంగాలలో ప్రత్యేకమైన నైపుణ్యం సంపాదించి అందులో ప్రావీణ్యత సాధిస్తారు.

ఆంజనేయస్వామి ఆరాధన, గణపతి ఆరాధన వలన మెరుగైన ఫలితాలు పొందుతారు. దాన ధర్మాల వల్ల ఉపశమనం లభిస్తుంది.

8, 17, 26 తేదీలలో జన్మించినవారిపై శని ప్రభావం ఉంటుంది. ఇతరులకు సహాయ పడటం, అన్యాయాన్ని ఎదిరించడం వీరి లక్షణాలు. వీరిపై ఈ సంవత్సరం కేతు, బుధ, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శని బుధ గ్రహాలు మిత్ర గ్రహాలు. అదే విధంగా శని, గురు గ్రహాలు కూడా మిత్ర గ్రహాలు. అందువలన వీరికి ఈ సంవత్సరం భౌతిక సంపదలు, అభీష్టసిద్ధి, విజయం ప్రాప్తిస్తాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి లభిస్తాయి. ఇన్సూరెన్స్ నుంచి ధనం రావటం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం రావటం జరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తులు కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. గొప్పవారి పరిచయాలు కలుగుతాయి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఈ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయి. రాజకీయ నాయకులు చాలా క్లిష్టమైన ఎన్నికలలో కూడా విజయం సాధిస్తారు.

ఈ సంవత్సరంలో వీరిపై శని, కేతు, గురు, బుధ గ్రహాల ప్రభావం ఉండటం వలన వీరు రుద్రాభిషేకం, గణపతి, ఆంజనేయ, దక్షిణామూర్తి ఆరాధన వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.

9, 18, 27 తేదీలలో జన్మించినవారిపై కుజ గ్రహ ప్రభావం ఉంటుంది. 2023 సంవత్సర సంఖ్య 7, కేతు సంఖ్య. జ్యోతిష శాస్త్ర ప్రకారం కేతువు, కుజుడు రెండూ ఒకే విధమైన ఫలితాలను ఇస్తాయి. అందువలన ఈ సంవత్సరం వీరికి మంచి సంవత్సరం అని చెప్పవచ్చు. ఈ సంవత్సర సంఖ్యలో ఉన్న 2,0,3 సంఖ్యలు చంద్ర, కేతు,బుధ, గురు గ్రహ ప్రభావాలను కలుగజేస్తాయి. కుజ గురు గ్రహ ప్రభావం వలన గురు మంగళ యోగం కలుగుతుంది. దీని వల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్, మిలటరీ, పోలీస్ రంగాలలో ఉన్నవారికి మంచి సంవత్సరం. నిర్మాణం మధ్యలో ఆగిపోయినవి మరల మొదలయ్యి, పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం పెండింగ్ పనులు అన్నీ పూర్తి అయ్యే అవకాశం ఉంది. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది మంచి సమయం కాదు.

పైకి ధైర్యంగా కనిపించినా, లోలోపల పిరికిగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉన్నవారికి అంత బాగోదు. మనీ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్త అవసరం. అనవసర వాద వివాదాలకు దూరంగా ఉండాలి. హనుమాన్, సుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. అంగారక పాశుపత హోమం చేయించుకుంటే మంచిది. రక్తదానం చేస్తే మంచిది.

గ్రహగతులు, వాటి ప్రభావాన్ని పరిశీలించి చూస్తే, ఈ సంవత్సరంలో అందరూ తగు ప్రయత్నంతో అభివృద్ధి పథంలో పయనిస్తారు. శుభకృత్ నామ సంవత్సరం తరువాత 2023లో వచ్చే శోభకృత్ నామ సంవత్సరం, సార్థక నామధేయంతో అందరికీ కొత్త శోభను తెచ్చి పెడుతుంది.



- మహమ్మద్ దావూద్
ఆస్ట్రో-న్యూమరో-గ్రాఫాలజిస్ట్
హైదరాబాద్.